క్లుప్తంగా

వైభవంగా సుబ్బాలమ్మ జాతర



సుబ్బాలమ్మ జాతర నిర్వహిస్తున్న యూనియన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఆషాఢ మాసం చివరి రోజు ఆదివారం సందర్భంగా ఆర్టీసీ డిపో టాటా మ్యాజిక్ వాహనాల యూనియన్ ఆధ్వర్యంలో పట్టణ గ్రామ దేవత సుబ్బాలమ్మ జాతర మహోత్సవం వైభవంగా జరిగింది. సుబ్బాలమ్మ దేవస్థానానికి యూనియన్ నాయకులు ఊరేగింపుగా వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. మేళ తాళాలు, గరగ నృత్యాలతో అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. యూనియన్ అధ్యక్షుడు బొక్కా వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు గుమ్మళ్ల శ్రీను, కార్యదర్శి వల్రే సత్తిబాబు, నాగాబత్తుల నాగరాజు, కత్తుల రమణ, బొంతు వెంకట్రావు, పోలిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు పట్టణ వైశ్య సంఘ సమావేశం

అమలాపురం టౌన్: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘ సర్వసభ్య సమావేశం ఈ నెల 6వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక వాసవీ కల్యాణ మండపంలో జరుగుతుందని సంఘ కార్యదర్శి నంబూరి సత్యనారాయణమూర్తి తెలిపారు. 2024–26 సంవత్సరాలకు ఏర్పాటు చేయబోయే నూతన కార్యవర్గంపై సమావేశంలో చర్చిస్తామన్నారు. పట్టణ పరిధిలో ఆర్య వైశ్య సోదరులందరూ సమావేశానికి విధిగా హాజరుకావాలని సత్యనారాయణమూర్తి విజ్ఞప్తి చేశారు.

11న సంస్మరణ దినం



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ కన్వీనర్ డాక్టర్ భీమారావు

అమలాపురం టౌన్: ఈనెల 11వ తేదీన అమలాపురంలో మాలల మృత వీరుల సంస్మరణ దినాన్ని నిర్వహించాలని మాలమహానాడు జేఏసీ ముఖ్య నాయకులు తీర్మానించారు. ఆదివారం స్థానిక సావరంలో జరిగిన జేఏసీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సమావేశానికి జాతీయ మాల మహానాడు కన్వీనర్ డాక్టర్ ఎంఏకే భీమారావు అధ్యక్షత వహించారు. 11న మృతవీరులకు ఘన నివాళి అర్పించిన తర్వాత ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేక నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో పండు అశోక్‌కుమార్, జగడం సత్యనారాయణ, చీకురుమిల్లి కిరణ్‌కుమార్, ఉండ్రు బాబ్జి, పోతుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు

అమలాపురం రూరల్: మండలంలోని పాత బండారులంకలో గ్రామంలోని చాముండేశ్వరీదేవి ఆలయంలో వేంచేసియున్న కులదేవత చౌడేశ్వరీ దేవి జన్మదినం సందర్భంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు మాడా వాసు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పూజల్లో అంకం కాశీ అనంతలక్ష్మి, మాజీ ఎంపీపీ వుటుకూరి సుబ్రహ్మణ్యేశ్వ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు చింతా లింగయ్య, అంకం గిరి, పిచ్చిక నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాల అందజేత



బాధితులకు నిత్యావసర సరకులను అందిస్తున్న గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు

ఉప్పలగుప్తం: మండలంలోని రామాలయం పేటలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన పెనుమాల వెంకటేశ్వరరావు కుటుంబానికి అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ అధినేత కుంచే రమణారావు వంట సామగ్రి, నిత్యావసర సరకులు, దుస్తులు, కూరగాయలు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గంటా లక్ష్మీప్రసాద్, పరమట రాజేష్, కుంచే అర్జున్, నాగాబత్తుల రాజ్‌కుమార్, దోనిపాటి రాంబాబు, పోలినాటి భీమేష్, పరమట మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ

అమలాపురం టౌన్: కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ జన్మదినం సందర్భంగా జిల్లా బీజేపీ కమిటీ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్‌లను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్వీ నాయుడు, పాలూరి సత్యానందం, కొల్లి సూర్యారావు, నక్కా త్రిలోచనరావు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో.. అసౌకర్యాలు ఇవిగో

- బోడసకుర్రు టిడ్కో గృహ సముదాయాలపై నిర్లక్ష్యపు నీడలు
- అవుట్ ఫాల్ డ్రెయిన్ లేక భవనాలను చుట్టుముట్టిన ముంపు నీరు
- పొంచి ఉన్న సీజనల్ వ్యాధులతో నివాసితుల ఆందోళన
- టౌన్ షిప్ అభివృద్ధి ప్రణాళికను పట్టించుకోని ప్రభుత్వం





బోడసకుర్రు టిడ్కో అపార్ట్‌మెంట్లను చుట్టుముట్టిన ముంపు నీరు

అమలాపురం టౌన్: స్థానిక మున్సిపాలిటీలోని పేద ప్రజలకు బోడసకుర్రులో ఏడేళ్ల క్రితం ప్రభుత్వం నిర్మించిన టిడ్కో గృహ సముదాయం నిర్వహణలో నిర్లక్ష్యపు నీడలు అలముకున్నాయి. మొత్తం 51 బ్లాక్‌ల(అపార్ట్‌మెంట్ల)తో నిర్మించిన టిడ్కో ఇళ్లలో ప్రస్తుతం 1,632 కుటుంబాలు నివసిస్తున్నాయి. టిడ్కో గృహ సముదాయానికి సువిశాలమైన రోడ్లు ఉన్నా అవుట్ ఫాల్ డ్రెయిన్ సౌకర్యం లేక ఇటీవల కురిసిన వర్షాలకు అపార్ట్‌మెంట్ల చుట్టూ ముంపు నీరు చేరింది. దీంతో 1,632 ఫ్లాట్‌ల్లో నివసిస్తున్న దాదాపు 4 వేల మంది ముప్పు తిప్పలు పడుతున్నారు. ముంపు నీటి కారణంగా టిడ్కో గృహ సముదాయం చుట్టూ అపారిశుధ్యం తాండవిస్తుండడంతో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. సీజనల్ వ్యాధులు ప్రబలుతాయేమోనని అక్కడి నివాసితులంతా ఆందోళన చెందుతున్నారు.

ఫ్లాట్లలో లీకేజీలు

దీనికి తోడు భవనాలు నిర్మించి ఎనిమిదేళ్లు కాకుండానే నాణ్యతా లోపాలు బయటపడుతున్నాయి. పలు ఫ్లాట్లలో వర్షం వస్తే చాలు లీకేజీ సమస్యలు తలెత్తుతున్నాయి. పైఅంతస్తు ఫ్లాట్లలో ఈ లీకేజీ సమస్య తీవ్రంగా ఉంటే తరువాతి ఫ్లాట్లలో తాగునీటి పైపులైన్ల నుంచి లీకేజీలు కనిపిస్తున్నాయి. వర్షం వస్తే అటు ఫ్లాట్లలో లీకేజీలు, ఇటు టిడ్కో అపార్ట్‌మెంట్ల చుట్టూ ముంపు నీటి సమస్యతో నివాసిత కుటుంబాలు అవస్థలు పడుతున్నాయి. టిడ్కో ఇళ్ల సముదాయం నిర్వహణకు అమలాపురం మున్సిపాలిటీ నుంచి ఐదుగురు పారిశుధ్య కార్మికులు, నలుగురు ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లను శాశ్వతంగా నియమించారు. అయితే 51 అపార్ట్‌మెంట్ల నిర్వహణ వారి వల్ల కావడం లేదు. వీరి సంఖ్యను మున్సిపాలిటీ పెంచాల్సి ఉంది. దీనికి తోడు వారంలో ఒక రోజు ఆయా కార్మికులను పట్టణ పారిశుధ్య అవసరాలకు ఉపయోగించుకుంటున్నారు. దీంతో టిడ్కో ఫ్లాట్ల వద్ద పారిశుధ్య సమస్యలు మరింత పెరుగుతున్నాయి.

అటకెక్కిన టౌన్ షిప్ ప్రణాళిక

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టిడ్కో భవన సముదాయాన్ని టౌన్ షిప్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించి ఆ దిశగా కొన్ని పనులకు కూడా శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే జనన్న మార్ట్ భవన నిర్మాణ దశలో ఉన్నా ప్రస్తుత ప్రభుత్వం దాని గురించి పట్టించుకోవడం లేదు. టౌన్ షిప్‌ను చేస్తూ మున్సిపాలిటీ కౌన్సిల్ సైతం తీర్మానాన్ని ఆమోదించింది. టౌన్ షిప్‌లో భాగంగా టిడ్కో గృహాలకు ఓ ఆస్పత్రి, పాఠశాల, పార్కు, పార్కింగ్ స్థలాలు ఇలా పలు సౌకర్యాలకు ప్రణాళిక ఉంది. దీని గురించి ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మున్సిపాలిటీ కూడా అచేతనంగా ఉండిపోయింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అవుట్ ఫాల్ డ్రెయిన్ నిర్మించేందుకు అప్పటి మంత్రి పినిపే విశ్వరూప్ రూ.1.20 కోట్లతో అంచనాలు సిద్ధం చేయించారు. ఈలోగా ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఆ అంశం మరుగున పడింది. వాస్తవానికి ఆ అవుట్ ఫాల్ డ్రెయిన్ నిర్మితమై ఉంటే టిడ్కోకు ముంపు నీటి సమస్య ఉత్పన్నం అయ్యేది కాదు.

> **అవుట్ ఫాల్ డ్రెయిన్ నిర్మించాలి**
>
> టిడ్కో భవనాల వద్ద మున్సిపాలిటీకి చెందిన 9 మంది ఉద్యోగులు 24 గంటలూ అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశాం. ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం అక్కడ అత్యవసరంగా రూ. కోటికి పైగా నిధులతో అవుట్ ఫాల్ డ్రెయిన్ నిర్మించాల్సి ఉంది. ఈ విషయాన్ని కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లాం.
>
> – ఎస్.మనోహర్, కమిషనర్, అమలాపురం మున్సిపాలిటీ

సత్తెమ్మ తల్లికి పసుపు కొమ్ములతో అలంకరణ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ముమ్మిడివరం: ఆషాఢ మాసం ఆఖరి ఆదివారం సందర్భంగా ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలోని సత్తెమ్మ తల్లిని పసుపు కొమ్ములతో అలంకరించారు. భక్తుల ఆర్థిక సాయంతో అమ్మవారికి పులిహోర నైవేద్యంగా సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. కాకినాడ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అమ్మవారిని దర్శించుకున్నారు.

శాకంబరిగా ముత్యాలమ్మ తల్లి



శాకంబరి అలంకరణలో ముత్యాలమ్మ తల్లి

అమలాపురం రూరల్: మండలంలోని పేరూరు పంచాయతీ పరిధిలో కొంకాపల్లిలో వేంచేసియున్న గ్రామదేవత ముత్యాలమ్మ తల్లి ఆదివారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం ఐదో ఆదివారం సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.


స్నేహితుల దినోత్సవంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



అల్లవరంలో తన చిన్ననాటి మిత్రులతో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

అల్లవరం: ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 1987–88లో తనతో పాటు పదో తరగతి చదువుకున్న చిన్ననాటి స్నేహితులను ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఆదివారం కలుసుకున్నారు. అల్లవరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో తన మిత్రులతో కలిసి స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ స్నేహానికి కుల, మత, ప్రాంత బేధాలు ఉండవన్నారు. కష్ట సమయాల్లో వెన్నంటి ఉండేవాడు స్నేహితుడు ఒక్కడేనన్నారు. నిజమైన స్నేహం ఎప్పుడూ చిగురిస్తూనే ఉంటుందని ఇజ్రాయిల్ అన్నారు. అనంతరం తన స్నేహితులతో కేక్ కట్ చేసి అందిరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మంగళంపల్లి బాలసుబ్రహ్మణ్యం, అడపా శ్రీనివాసరావు, కంకిపాటి గణపతి, బండిగుప్తావు శ్రీనివాసరావు, కంచర్ల శ్రీనివాసరావు, కంకిపాటి శ్రీను, అడపా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో విశ్రాంతి భవనం



పెచ్చులూడిపోతున్న విశ్రాంతి భవనం శ్లాబ్

యానాం: నియోజకవర్గ శివారు సీతారామనగర్‌లో ప్రయాణికులు వేచి ఉండే విశ్రాంతి భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఆదివారం శ్లాబ్ పైభాగం నుంచి పెచ్చులూడి పడ్డాయి. నాసిరకంగా నిర్మించడం వల్లే శ్లాబ్ దెబ్బతిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దొమ్మేటిపేట తదితర ప్రాంతాల నుంచి యానాం పట్టణానికి వచ్చే విద్యార్థులు, వ్యాపారులు, రైతులకు ఉపకరించే ఈ విశ్రాంతి భవనానికి మరమ్మతులు చేయాలని అధికారులను కోరుతున్నారు.

బడ్జెట్‌లో కేటాయించినవి అమలయ్యేలా కృషి

యానాం: 2024–25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో యానాం నియోజకవర్గానికి కేటాయించిన వివిధ పనులు, పథకాలు పూర్తి స్థాయిలో అమలు కావడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పుదుచ్చేరి నాలుగు రీజియన్లలో రహదారుల మరమ్మతులు, డ్రెయినేజీల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.120 కోట్లు కేటాయించారన్నారు. తీర ప్రాంత గ్రామమైన అయ్యన్ననగర్‌లో రహదారులు, డ్రెయినేజీల అభివృద్ధికి నిధులతో పాటు జలజీవన్ మిషన్ ద్వారా రూ.11.50 కోట్లతో ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులు, ప్రభుత్వ ఐటీఐలో మోడల్ కెరీర్ సెంటర్ ఏర్పాటు, సీవేజ్ ప్లాంట్ ఏర్పాటు తదితర పనులన్నీ పూర్తయ్యేలా సర్వశక్తులు ఒడ్డుతానని చెప్పారు.

కొత్త ప్రాజెక్టుల ప్రస్తావన లేదు

యానాం: సీఎం రంగసామి ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నూతన ప్రాజెక్టుల ప్రస్తావనే లేదని మాజీ సీఎం రంగసామి విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బడ్జెట్ ప్రసంగంలో రాష్ట్రాభివృద్ధికి సంబంధించి ఏ ఒక్క ప్రాజెక్టు ప్రకటించలేదన్నారు. ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిందని, నూతన పరిశ్రమల స్థాపనతోనే తిరిగి రెవెన్యూ మెరుగవుతుందన్నారు. నాలుగు రీజియన్లలోనూ రహదారుల అభివృద్ధి లేదని, మౌలిక సౌకర్యాలు కల్పించడం లేదని ఆరోపించారు. రైతులకు ఉపకరించే ఏ ఒక్క పథకాన్ని ప్రకటించలేదన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల రైతులకు సైతం పరిహారం ప్రకటించ లేదన్నారు. మొత్తంగా ఈ బడ్జెట్ అన్ని వర్గాలను నిరుత్సాహ పరిచిందన్నారు.

ఎంపీకి వినతి పత్రం

ముమ్మిడివరం: గోల్డ్ అప్రైజర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందరేశ్వరికి గోల్డ్ అప్రైజర్ల రాష్ట్ర అధ్యక్షులు నలమాటి కొండలరావు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. వారంతా ఆదివారం రాజమండ్రిలో ఎంపీ పురందరేశ్వరిని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పని చేస్తున్న 60 మంది అప్రైజర్లను తొలగించడం దారుణమన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఒకే రకమైన కమిషన్ అందించాలని, రిటైర్మెంట్ వయోపరిమితిని తొలగించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రం ఎంపీకి అందజేశారు. కార్యక్రమంలో వెంకట్ ఆచారి, శ్రీనివాస్, ఆచారి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ

ముమ్మిడివరం: డెంగ్యూ మాసోత్సవాల సందర్భంగా సబ్ యూనిట్ ఆఫీసర్ ఆదినారాయణ ఆధ్వర్యంలో నగర పంచాయతీ సూరాయి చెరువు బల్లగేటు సెంటర్‌లో డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.సంపూర్ణ వనిత, ఐశ్వర్య పాల్గొన్నారు.

బిడ్డకు జన్మనిచ్చిన బాలిక

అల్లవరం: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అల్లవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం అర్ధరాత్రి బిడ్డకు జన్మనిచ్చింది. బెండమూర్లంక పంచాయతీకి చెందిన తన బావపై ఇష్టం పెంచుకున్న బాలిక అతడితో గర్భం దాల్చినట్లుగా స్థానికులు చెబుతున్నారు. శనివారం రాత్రి ప్రసవ వేదనతో ఆస్పత్రికి వచ్చిన మైనర్ బాలికకు డాక్టర్ మౌనిక నార్మల్ డెలివరీ చేసింది. ఘటనపై అల్లవరం పోలీసులకు సమాచారం ఇచ్చారు.

జీజీహెచ్‌లో రోగులకు పండ్ల పంపిణీ



జీజీహెచ్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న అభిమానులు

యానాం: సీఎం రంగసామి 75వ పుట్టినరోజు సందర్భంగా పలువురు అభిమానులు, పార్టీ కార్యకర్తలు స్థానిక జీజీహెచ్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్ గిడ్ల చంద్రరావు, రిటైర్డ్ సీఐ గూటం శివగణేష్, మట్టపర్తి గణేష్, వెంకటేశ్వరరావు, మల్లాడి శ్రీను పాల్గొన్నారు. యానాంలో రోజువారీ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారు రెగ్యులర్ అవడంతో వారంతా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు నేతృత్వంలో సీఎం రంగసామిని కలిసి దుశ్శాలువాతో సత్కరించారు.

చల్లపల్లిలో రాస్తారోకో



చల్లపల్లి సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న దళిత నాయకులు

ఉప్పలగుప్తం: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, వర్గీకరణ రద్దు చేయాలంటూ దళిత నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. మండలంలోని చల్లపల్లి సెంటర్‌లో అమలాపురం-ఎస్.యానం ప్రధాన ఆర్అండ్‌బీ రహదారిపై ఆదివారం రాస్తారోకో, మానవహారం నిర్వహించారు. వాహనాలను అడ్డుకొని ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రహదారిపై వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాస్తారోకోలో దళిత ఐక్యవేదిక చైర్మన్ డీబీ లోక్, కన్వీనర్ జంగా బాబురావు, ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, గెడ్డం సురేష్ బాబు, రేవు తిరుపతిరావు, ములపర్తి సత్యనారాయణ, గెద్దాడ బుద్ధరాజు తదితరులు పాల్గొన్నారు.

తాండవపల్లిలో విద్యుత్ స్తంభం ఏర్పాటు



తాండపల్లిలో జేసీబీతో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

సాక్షి స్పందన

అమలాపురం రూరల్: మండలంలోని తాండవల్లిలో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్న పరిస్థితిని వివరిస్తూ ఈ నెల 2వ తేదీన వేలాడుతున్న విద్యుత్ తీగలు శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. విద్యుత్ శాఖ అమలాపురం ఈఈ మోకా రవికుమార్, ఏడీఏ అన్నవరం చర్యలు చేపట్టారు. ఆదివారం తాండవపల్లిలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయించారు. కథనం ప్రచురించిన సాక్షి దిన పత్రికకు సర్పంచ్ గంగుమళ్ల ఏసుబాబు, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

కవి సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

అమలాపురం టౌన్: తెలుగు భాషా ఔన్నత్యాన్ని, ప్రాశస్త్యాన్ని ప్రతిబింబించే దిశగా ఈ నెల 18న అమలాపురంలో నిర్వహిస్తున్న జాతీయ శతాధిక కవి సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. జాతీయ శతాధిక కవి సమ్మేళనం పోస్టర్లను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో ఆదివారం ఉదయం విడుదల చేశారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ, జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ మాకే బాలార్జున సత్యనారాయణ, సాంస్కృతిక సలహాదారు కడలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నాం



పాశర్లపూడిలంకలో శానిటేషన్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

మామిడికుదురు: భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు కార్యాచరణ చేపట్టామని డీఎల్‌పీఓ బొజ్జిరాజు పేర్కొన్నారు. పాశర్లపూడిలంకలో చేపట్టిన శానిటేషన్ కార్యక్రమాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. డెంగీ, డయేరియా, వైరల్ ఫీవర్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రతి గ్రామంలోను శానిటేషన్ పనులను ముమ్మరంగా చేపట్టామన్నారు. బ్లీచింగ్ చల్లించి పరిసరాలను పరిశుభ్రం చేయిస్తున్నామన్నారు. మురుగు నీటి గుంటల్లో ఆయిల్ బాల్స్ విడుదల చేయిస్తున్నామని తెలిపారు. ఫాగింగ్ చేయించడంతో పాటు మలాథియాన్ మందును స్ప్రే చేయిస్తునామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తెల గారెడ్డి సూర్యప్రకాశరావు, ఈఓపీఆర్డీ అడబాల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి డి.సురేష్ పాల్గొన్నారు.

ఆటో, మోటార్ సైకిల్ ఢీ

వ్యక్తి మృతి

అల్లవరం: స్థానిక ఘంటాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద మోటారుసైకిల్‌ని ఆటో ఢీకొట్టడంతో అల్లవరం మమాడితోటకు చెందిన మైలాబత్తుల నాగేశ్వరరావు (55) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మామిడితోటకు చెందిన నాగేశ్వరరావు తన మేనల్లుడు సాక భూషణంకు చెందిన స్కూటీపై అల్లవరం ఘంటాలమ్మ గుడి సమీపంలో ఉన్న మెడికల్ షాపుకి వెళ్లారు. మెడికల్ షాపులో బీపీ ట్యాబ్‌లెట్స్ తీసుకుని నాగేశ్వరరావుని స్కూటీపై ఎక్కించుకుని అల్లవరం వైపుకి మలుపు తిరుగుతుండగా అమలాపురం నుంచి తూర్పులంక వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మైలాబత్తుల నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందగా భూషణం స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఘటనపై ఎస్ఐ హరీష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రూ.10 వేల ఆర్థిక సాయం



బాధితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రజాసేవ చారిటబుల్ ట్రస్టు సభ్యులు

కాట్రేనికోన: అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని చిర్రయానం గ్రామానికి చెందిన రేకాడి గంగాద్రికి ప్రజాసేవ చారిటబుల్ ట్రస్టు సభ్యులు రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. ట్రస్ట్ సభ్యులంతా ఆదివారం గంగాద్రి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించి సాయం అందజేశారు. కష్టకాలంలో అభాగ్యులకు అండగా నిలుస్తున్న ప్రజాసేవ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులను స్థానికులు అభినందించారు.